

ప్రభుత్వ వైఖరి దారుణం

మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడం దారుణం. పులివెందుల మెడికల్ కళాశాలకు సీట్లు కేటాయించినా.. వాటిని రద్దు చేసేలా సీఎం చంద్రబాబు ఎన్ఎమ్‌సీకి లేఖ రాయడం అత్యంత దుర్మార్గం. దీనికి వంత పాడేలా మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలు చేయడం దిగజారుడుతనం. జగన్ హయాంలో అందుబాటులోకి తెచ్చిన మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయాలనుకోడం క్షమించరాని నేరం. వైద్య విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేసే ఈ నిర్ణయం సరైంది కాదు. – లీలావతి, బీటీపీ, గుమ్మఘట్ట మండలం



విద్యార్థుల ఆశలపై నీళ్లు

వైద్య విద్యను అభ్యసించే విద్యార్థుల ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లుతోంది. కళాశాలలకు అనుమతులు రానీకుండా ప్రైవేటు పరం చేసే కుట్ర చేస్తున్నట్లు కనిపిస్తోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో 17 మెడికల్ కళాశాలలు మంజూరుచేసి వైద్య విద్యకు పెద్దపీట వేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక వైద్య రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఎన్ఎంసీ సీట్లు మాకొద్దని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం దౌర్భాగ్యం. – గౌని ఉపేంద్రారెడ్డి, రాయదుర్గం



క్లుప్తంగా

మిమ్మల్ని మీరు పరీక్షించుకోవడమే.. క్రీస్తుమార్గం



క్రీస్తు చర్చిలో మాట్లాడుతున్న వాక్యోపదేశకులు

రాయదుర్గంటౌన్: మిమ్మల్ని మీరు పరీక్షించుకుని సన్మార్గంలో నడవడమే సంఘంలో క్రీస్తు చూపిన మార్గమని బీఓయూఐ ముఖ్య వాక్యోపదేశకులు రాజేంద్రబాబు, బాబురావు తెలిపారు. సోమవారం పట్టణంలోని రాజీవ్ గాంధీ కాలనీలోని క్రీస్తే చర్చిలో క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో సంఘంలో జనులు ఎలా ప్రవర్తించాలి అనే అంశంపై ప్రత్యేక వాక్యోపదేశం చేశారు. వైజాగ్, విజయవాడ వక్తలు రాజేంద్రబాబు, బాబురావుతోపాటు స్థానిక విజయరాజు తదితరులు మాట్లాడారు. సంఘం సభ్యులుగా, విశ్వాసులుగా కచ్చితమైన మార్గదర్శకంలో ఎలా నడవాలో తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక క్రీస్తు సంఘం కన్వీనర్ ఆనంద్‌రాజ్, సంఘం పెద్దలు ఇస్సాకప్ప, జయన్న, డేవిడ్ మల్లికార్జున, ఏసుదాస్, ప్రభుదాసు, జయపుత్ర, అమృత్‌రాజ్, విక్టర్, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కూడేరు: మండలంలోని ముద్దలాపురం సమీపంలో అనంతపురం - బళ్లారి ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహన ప్రమాదంలో బళ్లారికి చెందిన ఈరన్న గౌడ్ సోమవారం గాయపడ్డాడు. బళ్లారి నుంచి ద్విచక్ర వాహనంపై అనంతపురం వెళ్తుండగా ప్రమాదం జరిగింది. స్థానికులు అతన్ని కూడేరు ఆస్పత్రికి తరలించారు.

కుందుర్పి ఎస్ఐగా బాలరాజు



కుందుర్పి: కుందుర్పి పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా బాలరాజు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ వెంకటస్వామి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో జిల్లా కేంద్రంలోని డీటీసీలో ఉన్న ఎస్ఐ బాలరాజును కుందుర్పి ఎస్ఐగా నియమించారు.

వరద బాధితులకు గార్మెంట్స్ అసోసియేషన్ చేయూత



ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు డీడీ అందిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం రెడీమేడ్ గార్మెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ వరద బాధితులకు తమవంతు చేయూతగా నిలిచారు. ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.3 లక్షల విరాళంతోపాటు రూ.15 లక్షల విలువ చేసే 5 వేల ప్యాంట్లు విరాళంగా ప్రకటించారు. సోమవారం పట్టణంలోని గార్మెంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులకు విరాళాన్ని డీడీ రూపంలో అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు టంకశాల హనుమంతు, రాజశేఖర్, మస్తాన్, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

20న పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 20న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, అమర్‌రాజ గ్రూప్, రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్, వికాస్ అండ్‌డీఎస్‌సీ కంపెనీల సహకారంతో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జరగనున్న జాబ్‌మేళాలో జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. టెన్త్ నుంచి ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు సంబంధిత సర్టిఫికెట్లతో 20న ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు. మరింత సమాచారం కోసం 9182920381, 9988853335 సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో శిశుమందిరం విద్యార్థుల ప్రతిభ



అవార్డులు అందుకుంటున్న రాయదుర్గం శిశుమందిరం విద్యార్థులు

రాయదుర్గంటౌన్: నంద్యాలలోని సరస్వతీ విద్యాపీఠం ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో రాయదుర్గంలోని శిశు మందిరం విద్యార్థులు ప్రతిభ కనబరించారు. 5వ తరగతి విద్యార్థిని శ్రీజన్య వాటర్ కన్జర్వేషన్‌లో ప్రథమ బహుమతి, చంద్రయాన్ -3 ఇన్నోవేషన్‌లో ప్రణీత్ ప్రథమ బహుమతి, సింపుల్ మిషన్స్‌లో పద్మావతి రెండో బహుమతి సాధించారు. ఇటీవల జిల్లాస్థాయి శిశుమందిరాల సైన్స్‌ఫేర్‌లోనూ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపినట్లు పాఠశాల అధ్యక్షుడు పొరాళ్ల ధనార్జున తెలిపారు. పాఠశాల హెచ్ఎం రాజేశ్వరి, అచార్యబృందం, తోటి విద్యార్థులు విజేతలను అభినందించారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు

- మిన్నంటిన ప్రవక్త గీతాలాపన
- మక్కా, మదీన నమూనాలతో భారీ ప్రదర్శన



వెండి దీపారాధన వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న దర్గా కమిటీ అధ్యక్షుడు అజ్మతుల్లా



రాయదుర్గంలో మిలాదున్ నబీ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



రాయదుర్గం పట్టణంలో ప్రదర్శించిన మక్కా, మదీనా నమూనాల ప్రదర్శన

రాయదుర్గంటౌన్: పట్టణంలో జష్నే ఈద్ మిలాద్ ఉన్ నబీ (మహమ్మద్ ప్రవక్త జన్మదినం) వేడుకలను ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గౌసెఆజం దర్గా మసీదు కమిటీ ఆధ్వర్యంలో వందలాది మంది ముస్లింలతో భారీగా ఊరేగింపు నిర్వహించారు. మక్కా, మదీన మసీదులను పోలిన నమూనాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి జెండాలతో కాలినడకన ముస్లింలు పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఉత్సాహంగా ప్రవక్త మహమ్మద్ (సొఅసొ) గుణగణాలను కీర్తిస్తూ నాతీపాక్, సలాములు చదువుతూ 'నారే తక్బీర్ అల్లాహు అక్బర్' అంటూ నినాదాలు చేస్తూ పెద్దలు, చిన్నారులు ముందుకు సాగారు. యువత ఇస్లామిక్ జెండాలతో బైక్ ర్యాలీ జరిపారు. బళ్లారి రోడ్డు దర్గా మసీదు వద్ద ప్రారంభమైన ర్యాలీ ఆత్మకూరువీధి, కోట, మొలకాల్మూరు రోడ్డు, వినాయక సర్కిల్, పాత బస్టాండ్, లక్ష్మీబజార్, కణేకల్లు రోడ్డు, ఓబుళాచారిరోడ్డు మీదుగా తిరిగి మసీదుకు చేరుకున్నారు. అక్కడ జోహర్ నమాజ్ అనంతరం ప్రత్యేక దువా చేసి హాజరైన ముస్లింలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీకి వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి హాజరై ముస్లింలకు మిలాదున్ నబీ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో దర్గా మసీదు ముతవల్లి అబ్దుల్ వాహాబ్, చమ్మా అస్లాం, అబూబక్కర్, ప్రభుత్వ ఖాజీ సైఫుల్లా, అంజుమన్ అజ్మతుల్ ఇస్లాం కమిటీ అధ్యక్షుడు బ్రెడ్ సర్మాస్, మౌలానా మహమ్మద్ ముజాహిద్ రజా, హఫీజ్ అమానుల్లా తదితరులు హాజరయ్యారు.

వజ్రకరూరు: మండల కేంద్రంలో సోమవారం మిలాదున్‌నబీ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక చిన్న ఆసారు మందిరంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముజావర్ ఆలమూర్ ఫక్రుద్దీన్,ముస్లింలు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బొమ్మనహాళ్, ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట, దర్గాహొన్నూరు, కల్‌హోళ, గోవిందవాడ, గోనేహాళ్, నేమకల్లు, కురువళ్లి, బొల్లనగుడ్డం తదితర గ్రామాల్లో ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్లింలు అన్నదానం నిర్వహించారు.

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం, నియోజకవర్గ వ్యాప్తంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ముస్లింలు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ముస్లింలు మసీదుల్లో ప్రార్థనలు చేశారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

కణేకల్లు: మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను పురస్కరించుకొని మండల కేంద్రంలో సోమవారం మిలాద్ ఉన్‌నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం మదీనా మసీదు నుంచి మక్కా, మదీనా నమూనాల జుల్ఫ్‌తో బస్టాండ్ వరకు శాంతిర్యాలీ చేశారు. కార్యక్రమంలో అబ్దుల్ వహాబ్ ఖాద్రీ, నేముతుల్లా సాహెబ్, మైనార్టీ నాయకులు షేక్ ఫక్రుద్దీన్, ఎంసీ సర్మాస్, బళ్లారి మున్నా తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్ సుబాని జెండా కట్ట దర్గాకు వెండి దీపారాదన

ఉరవకొండ: స్థానిక కామన్నకట్ట వద్దనున్న ప్రసిద్ధ మహబూబ్ సుబానీ జెండా కట్ట దర్గాకు 2.50 కేజీల వెండితో తయారు చేసిన దీపారాధనకు దర్గా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జెండా కట్ట దర్గా అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అజ్మతుల్లా మాట్లాడుతూ దర్గా అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో 2.50 కేజీల వెండితో రూ.3 లక్షల విలువ గల దీపారాధన తయారు చేసినట్లు తెలిపారు. అక్టోబర్ నెలలో జరిగే మహబూబ్ సుభానీ జెండా, ఉరుసు ఉత్సవాల్లో వెండి దీపారాధనను భక్తులకు అందుబాటులో ఉంచుతామన్నారు.

మహమ్మద్ ప్రవక్త కేశ దర్శనం

రాయదుర్గంటౌన్: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా సున్నీ దర్గా మసీదులో సోమవారం సాయంత్రం అసర్ నమాజ్ అనంతరం ఏర్పాటు చేసిన మహమ్మద్ ప్రవక్త కేశాన్ని తిలకించేందుకు ముస్లింలు ఎంతో ఆసక్తి చూపారు. ఏటా మిలాద్ ఉన్న నబీని పురస్కరించుకుని దర్గా మసీదులో పవిత్ర కేశ దర్శనం ఏర్పాటు చేయడం ఆనాయితీగా వస్తోంది.

ఆకట్టుకున్న మక్కా, మదీనా నమూనాలు

- ఉరవకొండ పురవీధుల్లో జెండా ఊరేగింపు
- మహ్మద్ ప్రవక్త కేశాన్ని దర్శించుకున్న వేలాది భక్తులు

ఉరవకొండ: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ముస్లింలు సోమవారం మిలాద్ ఉన్ నబి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక జమాలుద్దీన్ ఖాద్రీ దర్గా ఆవరణలోని ఆసార్ మకాన్ నుంచి వేలాది మంది ముస్లింలు జెండాలు పట్టుకొని జులుస్ వేడుకల్లో పాల్గొన్నారు. అసార్ మకాన్ నుంచి విశేష పుష్పాలతో అలంకరించిన జెండాను పట్టణ పురవీధుల్లో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో పవిత్ర మక్కా, మదీనా ఆకృతులను అందంగా ఏర్పాటు చేసి, వాటిని వాహనాల్లో ఊరేగించారు. అనంతరం క్లాక్‌టవర్ వద్ద ఫకీర్లు చేసిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం మహ్మద్ ప్రవక్త కేశఖండాన్ని సయ్యద్‌షా అజ్మతుల్లా హుసేనీ, హజ్రత్ సయ్యద్‌షా ఖతుబుద్దీన్‌ఖాద్రీ, హాజరత్ సయ్యద్‌షా జమాలుద్దీన్ ఖాద్రీల ఆధ్వర్యంలో ప్రదర్శించారు. దీన్ని తిలకించడానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు.



వజ్రకరూరులో మిలాద్ ఉన్ నబీ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



ఉరవకొండలో మిలాద్‌ఉన్ నబీ వేడుకల్లో భాగంగా జెండా ఊరేగిస్తున్న ముస్లింలు



సున్నీ దర్గా మసీదులో ప్రవక్త కేశాన్ని తిలకిస్తున్న ముస్లింలు



కణేకల్లులో మక్కా మదీనా నమూనాలతో శాంతిర్యాలీ చేస్తున్న ముస్లింలు

విద్యార్థుల జీవితాలతో చెలగాటం తగదు



మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

రాయదుర్గం: మెడికల్ సీట్లపై సీఎం చంద్రబాబు వైఖరి సరైంది కాదని రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు అన్యాయం చేస్తూ, పెత్తందారులకు మేలు చేసే విధానం మానుకోవాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎక్కడ పేరు వస్తుందోనని కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు హయాంలో ఒక్క మెడికల్ కళాశాల కట్టలేదని, జగన్ పాలనలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారన్నారు. గతేడాది ఐదు కళాశాలలు అందుబాటులోకొచ్చినట్లు తెలిపారు. ఈ ఏడాది మరో ఐదు ప్రారంభించాల్సి ఉండగా, కూటమి అధికారంలోకి రావడంతో ఆప్రక్రియ ఆగిపోయిందన్నారు. పేద విద్యార్థులు రూ.కోట్లు చెల్లించి వైద్య విద్య చదవడం కష్టమన్నారు. ఇతర దేశాలకు వెళ్లి చదువుకోవడం ఖర్చుతో కూడిన పని అని, జగన్ పుణ్యాన ఉచితంగా వైద్య విద్య చదివే అవకాశం దక్కినా ఎంబీబీఎస్ సీట్లు వద్దంటూ కేంద్రానికి లేఖ రాయడం సిగ్గుచేటన్నారు. ఇది క్షమించరాని నేరమన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం మంచిదికాదని ఆయన హితవుపలికారు.

జోడు లింగాలకు క్షీరాభిషేకం

కూడేరు: మండల కేంద్రం కూడేరులో ప్రసిద్ధిగాంచిన శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆలయ అర్చకులు రుద్రాభిషేకం, క్షీరాభిషేకం పూజలు చేశారు. ఆ తర్వాత వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పూజల్లో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో జోడు లింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

సీతారాం ఏచూరి సేవలు ఎనలేనివి



అంబేడ్కర్ సర్కిల్లో సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు



ఉరవకొండలో సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వివిధ పార్టీల నేతలు

కళ్యాణదుర్గం రూరల్: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి సేవలు ఎనలేనివని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుళు తెలియజేశారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఓబుళు మాట్లాడుతూ ప్రజా సమస్యల కోసం పోరాడే ప్రజల మనిషి మరణించడం బాధాకరమన్నారు. అనంతరం ఆయన చేసిన సేవలపై తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల శ్రీరామిరెడ్డి, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి లేని లోటు పూడ్చలేనిది

ఉరవకొండ: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి లేని లోటు పార్టీకి, దేశానికి పూడ్చలేనిదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్లప్ప తెలిపారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయ ఆవరణలో సీతారం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఉరవకొండ ఎంపీపీ నరసింహులు, మాజీ జెడ్పీటీసీ తిప్పయ్య, విద్యావేత్త ఎర్రిస్వామి, సాదిక్, వెంకటేష్ హాజరయ్యారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రంగారెడ్డి, మధుసూదన్, జ్ఞానమూర్తి, విరుపాక్షి, కోనంకి రాముడు, సిద్ధప్ప, మూస్టురు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దళిత, గిరిజనులపై దౌర్జన్యం చేస్తే సహించం

కంబదూరు: కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక దళిత, గిరిజనులపై దాడులు అధికమయ్యాయని, అధికారం ఉంది కదా .. అని దాడులు, దౌర్జన్యాలు చేస్తే సహించేదిలేదని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి హెచ్చరించారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద మండలంలోని దళిత, గిరిజన కుటుంబాలపై కూటమి నాయకుల దాడులను ఖండిస్తూ, నిరసన తెలియజేశారు. సాకే హరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత దళిత, గిరిజనులపై రాజకీయ వివక్ష చూపుతూ వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం,నాయకులు ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

జేఏసీ నాయకులు చెలిమప్ప, దొణతిమ్మ, దాబా రమేష్, గోపాల్, ప్రతాప్, నరసింహులు, బాలు, శివ, రాఘవ, రామాంజినేయులు, రామ్మోహన్, పెద్దన్న పాల్గొన్నారు.

నగరేశ్వరుడికి రుద్రాభిషేకం

వజ్రకరూరు: స్థానిక నగరేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలతోపాటు అర్చనలు, రుద్రాభిషేకం, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, మహామంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం చేశారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకొని స్వామిని దర్శించుకున్నారు.

రూ.17.2 లక్షల రికవరికీ ఆదేశం



ప్రజావేదికలో ఉపాధిహామీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డ్వామా ఏడీపీ సుధాకర్‌రెడ్డి

బెళుగుప్ప: మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకల్లో రూ.17.2 లక్షలు రికవరీకి డ్వామా ఏపీడీ సుధాకర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ పెద్దన్న, ఎంపీడీఓ రామచంద్ర ఆధ్వర్యంలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. డ్వామా ఏపీడీ సుధాకర్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ లక్ష్మీనారాయణ హాజరయ్యారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు 19 గ్రామ పంచాయతీల్లో 1,122 ఉపాధి పనులకుగాను రూ.7.38 కోట్ల నిధులను ఖర్చు చేశారు. అనంతరం బహిరంగ చర్చా వేదికలో రూ.60,87,769 అవినీతి జరిగిందని డీఆర్‌పీలు, ఎస్ఆర్‌పీలు వెల్లడించారు. రూ.17,23,358 నిధులు రికవరీకి ఏపీడీ ఆదేశించారు. పనుల నిర్వహణలో అధికారుల తప్పిదాలకు రూ.1,04,000 జరిమానా విధించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పుష్పావతి, పీఆర్ జేఈ సుధాకర్, బెళుగుప్ప సర్పంచ్ సాలిబాయి, ఏపీఓలు సూర్యప్రకాశ్, కృష్ణమూర్తి, హౌసింగ్ ఏఈ శివారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

'సత్యసాయి' తాగునీటి సరఫరా పునరుద్ధరణ

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాలకు సత్యసాయి నీటిసరఫరాను పునరుద్ధరిచారు. సత్యసాయి కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలతోపాటు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 22 నుంచి సత్యసాయి కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. దీంతో గ్రామాలకు సత్యసాయి నీటిసరఫరా నిలిచిపోయింది. జిల్లా ఉన్నతాధికారుల హామీ మేరకు ఈనెల ఈనెల 12న సత్యసాయి కార్మికులు విధుల్లోకి చేరారు. సోమవారం కొనకొండ్ల సత్యసాయి రిజర్వాయర్ నుంచి గ్రామాలకు సత్యసాయి నీటి సరఫరాను ప్రారంభించినట్లు సత్యసాయి రిజర్వాయర్ ఇంజనీర్ బాలుయాదవ్ తెలిపారు.

కూలిన హెచ్చెల్సీ బ్రిడ్జిని పరిశీలించిన ఎమ్మెల్యే



నాగేపల్లి వద్ద కూలిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

కణేకల్లు: మండలంలో నాగేపల్లి శివారులో 155 కిలోమీటరు వద్ద కూలిన హెచ్చెల్సీ బ్రిడ్జిని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సోమవారం పరిశీలించారు. మాల్యం నుంచి హెచ్చెల్సీ ఎడమగట్టుపై గ్రావెల్ పరిచి, రాకపోకలకు ఇబ్బందిలేకుండా చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే హెచ్చెల్సీ సిస్టంలో చాలా బ్రిడ్జిలు దుస్థితికి చేరుకున్నాయని, ఈ బ్రిడ్జిలకు సమానంగా నిర్మించ తలపెట్టిన బ్రిడ్జిలు అర్థంతరంగా ఆగిపోయాయన్నారు. సర్పంచు జయరాంచౌదరి, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులను నివారిద్దాం

గుమ్మఘట్ట: నులిపురుగులను నివారించేందుకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యులు రమేష్ తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల పరిధిలో 0 నుంచి 19 ఏళ్లలోపు 12,170 మంది పిల్లలు ఉన్నారన్నారు. నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు మంగళవారం పిల్లలకు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

కర్ణాటక సరిహద్దు రోడ్డుకు మరమ్మతులు

బ్రహ్మసముద్రం: మండలంలోని పడమటి కోడిపల్లి గ్రామ పంచాయతీ పొబ్బర్లపల్లి నుంచి కర్ణాటక చెళికెర వెళ్లే రోడ్డు చాలా ఏళ్లుగా గుంతలమయమైంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సర్పంచ్ మమత పొబ్బర్లపల్లి గ్రామం నుంచి కర్ణాటక సరిహద్దు వరకు రహదారికి ఇరువైపులా కంప చెట్లను తొలగింపజేశారు. అనంతరం గుంతలు పూడ్చి, మట్టి చదును చేయించారు.

జాతీయ అవార్డు గ్రహీతలకు సన్మానం



జాతీయ అవార్డు గ్రహీతలకు ఆత్మీయ సన్మానం చేస్తున్న గాంధీ హరిజన హాస్టల్ కమిటీ సభ్యులు

ఉరవకొండ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డు అందుకున్న జెంజిమెన్, భారత సేవా రత్న అవార్డు అందుకున్న మల్లికార్జునను హరిజన హాస్టల్ కమిటీ అధ్యక్షురాలు, విశ్రాంత సీడీపీఓ రామాంజనమ్మ, కమిటీ సభ్యులు పొల్తూరు ఆనందరాజు ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. చాబాల వైఎస్సార్‌సీపీ సర్పంచ్ జగదీష్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సోముల రాజు ఫౌండేషన్ శివరాజు, బహుజన సమాజ్‌పార్టీ నాయకులు అంకే తిప్పేస్వామి, ఎంసీహెచ్ఓ గురుప్రసాద్, సీపీఎం మండల కార్యదర్శి విరుపాక్షి, సీఐటీయూ నాయకులు సుధాకర్, గుర్రం జాషువా అభ్యుదయ కమిటీ అధ్యక్షులు ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్కల దాడిలో నలుగురికి గాయాలు



దాడిలో గాయపడిన బాలుడు

కుందుర్పి: గ్రామాల్లో పిచ్చికుక్కల దాడులు అధికమయ్యాయి. సోమవారం ఉదయం మలయనూరులో చిన్నారులు కిరణ్, ప్రణీతతో పాటు మరో ఇద్దరిపై పిచ్చికుక్క లు దాడి చేసి, గాయపరిచాయి. వీరిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు చేయించారు. రెండు రోజుల క్రితం కెంచంపల్లిలో ముగ్గురిపైనా, కుందుర్పిలో ఇద్దరు, బెస్తరపల్లిలో ఒకరిపై పిచ్చికుక్కలు దాడిచేసి, గాయపరిచాయి.